# చచ్చి పుట్టినవాళ్ళు

ఆకాశంలో రంగురంగుల మతాబా వెలుగులుచూస్తూ ఆనందిస్తూ నడుస్తున్నారు. ఊరవతల స్మశానంవైపు నడుస్తున్నారు. స్మశానం పక్కనున్న పంటకాలువలో పడమటి ఆకాశం నీడ చూచుకుంటూ ఆనందిస్తున్న చక్కని సాయంత్రంలో నడుస్తున్నారు.

ఎవరో నిర్భాగ్యుడు— లోకంలో నూకలు నిండుకున్న నిర్భాగ్యుడు వెళ్ళిపోయాడు. మృత కళేబరాన్ని అగ్నిహోత్రుడికి కప్పగించి దూరంగా రావిచెట్టు మొదట్లో కట్టిన దిమ్మమీద కూర్చున్నారు చచ్చినవాడి బంధువులు.

మానవుడు తనదిగా రుజువు చేసుకోగలిగే ఆఖరి ఆస్తి స్మశానంలోని ఎర్రమంటలు. ఎర్రని పడమటి ఆకాశంలోకి కోర్కెల కోరమీసాలు సారించుతున్న మంటల్ని చూస్తూ అలానే నడుస్తున్నారు.

రఘునాథం అంటున్నాడు: "ఒరేయ్! మాత్యూ ఆర్నాల్డు గొప్ప పద్యము వ్రాశాడురా" అని.

సుబ్రహ్మణ్యం మాట్లాడలేదు. ముఖం జాలిగాపెట్టి నడుస్తున్నాడు. వైరాగ్యం తలకెక్కిన కళ్ళు తేలవేస్తూ నడుస్తున్నాడు.

రఘునాథం బరువుగా అడుగులు వేస్తున్నాడు. అరమోడ్పు కన్నులతో ఆలోచిస్తున్న సుబ్రహ్మణ్యంకేసి చూస్తూ అంటున్నాడు. "స్మశానం చాలా విచిత్రమైన ప్రదేశం సుమా!" అని.

సుబ్రహ్మణ్యం సాలోచనగా తలూపాడు. చాలా దర్జా అయినవాడు. ప్రతి చిన్న విషయంమీదా అనవసరంగా మాట్లాడే రకంకాదు. అసలే మితభాషి, ఇలాంటి సమయాల్లో బొత్తిగానే ముంచుకుపోయిన సత్తులా తయారవుతాడు. సుబ్రహ్మణ్యం నుదుటిలో తాతలనాటి పాతకాలాల వైభవముట్టి పడుతూ ఉంటుంది. పంట కాలువ పక్కనే నిద్రగన్నేరుచెట్టు క్రింద కూర్చున్నారు. వాళ్ళకి గంటన్నర దూరంలోవుంది రాత్రి.

పంటకాలువ ప్రవాహానికడ్డంగా చేపలకోసం 'మావు' అమర్చబడివుంది. యథాలాపంగా దానికేసి చూస్తున్నాడు సుబ్రహ్మణ్యం. ఒకటో రెండో చిన్న చేపలు దానిలో అటూ యిటూ కదులుతున్నాయి. 'మావు'లో దూరినవేవీ బయటికి రాలేవు. నీటిపాము అందులోకి దూరింది పైకిరాలేక నానాపురాకులూ పడుతోంది.

"రఘూ! చూడరా! ఆనీటికాయ్య స్ట్రగులు!" కొంచెం గట్టిగానే అన్నాడు సుబ్రహ్మణ్యం. పరాకు చిత్తగిస్తున్న రఘునాథం త్రుళ్లిపడి చూసాడు.

స్మశానంలోని మంటలవేడికి ద్రవించిన గుండెలతో మాట్లాడుతున్నారువాళ్లు.

"భవిష్యత్తులో నా జీవితానికి ఆనందమూ, సౌఖ్యమూ వుంటాయనుకోను. ఆ పరమేశ్వరుడేమిచేస్తాడో ఏమిటోగాని" అన్నాడు రఘునాథం.

"మరేం పరవాలేదురా! ఎన్నికష్టాలొచ్చినా ఎదురించి ముందుపోగలం" అన్నాడు సుబ్రహ్మణ్యం.

రఘునాథం సాలోచనగా అంటున్నాడు. భవిష్యజ్జీవితాన్ని ఆశతో పరామర్శిస్తూ అంటున్నాడు. "ఒరేయ్! యిప్పటివరకూ మన జీవితాలు తరిచి చూచుకుంటే మనం స్నేహితులుగా బ్రతుకుతామనే ధీమా కనిపిస్తోంది. భవిష్యత్తులో

గూడా మనం ఎప్పుడూ ఒకళ్ళనొకళ్ళు విడిచిపెట్టకూడదు. ఏమంటావ్?" నూరేళ్ళ జీవితాన్ని తూచి మరీ అన్నాడు రఘునాథం.

"తప్పకుండాను" సుబ్రహ్మణ్యం అతిసాధారణంగా అంటున్నాడు. "మనం విజయం పొందాలిరా! వెధవ శాఖల గొడవ లెక్క చెయ్యకుండాను." సంఘ సంస్కర్తల గంభీర వాక్కులు సుబ్రహ్మణ్యం గొంతుకలో ధ్వనించాయి.

"నిశ్చయంగా అలాగే చేదాము. నువ్వుమాట తిరిగి పోగూడదు మరి!" రఘునాథం తనభవిష్యదదృష్టాన్ని తలుచుకుంటూ మెరుస్తున్న కళ్ళతో అన్నాడు.

"మైలున్నర నడాలి, పోదామా?"

రఘునాథం లేచాడు. లేస్తూనే అన్నాడు. "మన జీవితంలో మరచిపోలేని రోజురా యిది."

"నిజమే!" అన్నాడు సుబ్రహ్మణ్యం. అన్నాడేగాని ఏదో ఆలోచనలో పడ్డాడు. అతని జీవితం మాకునూలాల వారంగంలోనుంచి ఏదో సంఘటన బావురుమని అరచింది. వాళ్ళ వూళ్ళో జరిగిన సంఘటన అది. తమ యింటిప్రక్క కరణంగారి చిట్టితో తానన్నమాట జ్ఞాపకం వచ్చింది. చిట్టి పెద్దమనిషై మూడు నెలలైంది. ఆవేళ శ్రావణ శుక్రవారం. తనయింటికి పూలకొచ్చింది చిట్టి. తాను చిట్టి చేయి పట్టుకున్నాడు. అనేక

రోజుల నుంచిగల పరిచయము, యించుమించు స్నేహము, సుబ్రహ్మణ్యంలోని మంచితనమూ, చిట్టెని కాదనలేకుండా చేసాయి. ఆ వేళ దొడ్లో పాక వెనకాల సువర్ణ గన్నేరు చెట్టు ప్రక్కన యిలాగే అన్నాడు తను. విడిపోతూ గట్టిగా ముద్దు పెట్టుకొని, "చిట్టీ! మన జీవితంలో ఈరోజును మరచిపోగూడదు సుమా!" అని.

ఆ విషయంతో పాటు ఆ వేళ తానసుభవించిన పారిజాత పుష్పం సువాసనకూడా జ్ఞాపకం వచ్చింది సుబ్రహ్మణ్యానికి. తాను చిట్టెని మరచిపోలేదూ? ప్రశ్నించుకున్నాడు సుబ్రహ్మణ్యం. చిట్టెకూడా తన్ను మరచిపోయేవుంటుంది. సందేహమేమిటి? చక్రధరపూర్‌లో మొగుడి దగ్గరఉంటోంది. ఇద్దరు పిల్లలుకూడాను. చిట్టెని తలుచుకుంటుంటే మళ్ళీ చూడాలనిపించింది సుబ్రహ్మణ్యానికి.

చిట్టెని మరచిపోయినట్టే ఈ రోజునుమాత్రం ఎందుకు మరచిపోగూడదు ?—సుబ్రహ్మణ్యం మళ్ళీ ప్రశ్నించుకున్నాడు. అదివేరు ఇదివేరూనూ! అనుకున్నాడు; రఘునాథాన్ని మరచిపోతానా అనుకున్నాడు.

రఘునాథంకూడా ఏవేవో ఆలోచించుకుంటున్నాడు.

ఆఖరికి రఘునాథమే అన్నాడు "అవునుగాని ఎస్సే వ్రాశావా? రేపే చూపించాలి" అని.

"లేదురా. యిప్పుడు వ్రాస్తా"నన్నాడు సుబ్రహ్మణ్యం.

రూమ్‌కి వచ్చేసారు. సుబ్రహ్మణ్యం తాళంతీస్తున్నాడు. 'రఘునాథం' అంటూ పిలుస్తూ లోపలినుంచి యివతలకివచ్చారు ఇంటి యజమాని గన్నయ్యశాస్త్రిగారు. వచ్చి చెప్పటం ప్రారంభించారు. 'రఘునాథం నీకేదో టెలిగ్రాం వచ్చిందయ్యా రెండు సార్లు వచ్చి వెళ్ళిపోయాడు పోస్టుజవాను. ఎక్కడనుంచి ఏమిటని అడిగాను చెప్పలేదు. రేపుదయం తెస్తానని వెళ్ళిపోయాడు.' అన్నారు గన్నయ్యశాస్త్రిగారు సహజమైన ధోరణిలో.

రఘునాథం ఉక్కిరి బిక్కిరయ్యాడు. టెలిగ్రామా అన్నాడు. అవును టెలిగ్రామేనని సమాధానం విన్నాడు. ఎక్కడ్నుంచి చెప్మా అనుకున్నాడు రఘునాథం. గదిలోకి వెళ్ళి సుబ్రహ్మణ్యం లైటువేశాడు. మడతమంచంపై పడేసిన పుస్తకాలు బోసినోటితో అరుస్తున్నాయి.

"ఆఁ మీ యింటి దగ్గర్నుంచే అయివుంటుంది. ఆవేళ చెప్పావుకదూ కోర్టుకి మనూరి సత్యం వచ్చాడని. మీనాన్న గారికి సుస్తీగావుందని చెప్పాడతను" అన్నాడు సుబ్రహ్మణ్యం మామూలుగా.

"అవునవును" నాన్నగారి దగ్గర్నుంచే. సుస్తీ ఎక్కువైనట్టుంది. ఇంకెవరున్నారప్పులు? తల్లీదండ్రీ తప్ప.

* * *

నూతి దగ్గరకు వెళ్ళి చేతులూ కాళ్ళూ కడుక్కొని వచ్చారు వాళ్ళు. నూకమ్మ హోటలునుంచి క్యారేజి తెచ్చింది.

“లేచి భోంచేదామా?” అన్నాడు సుబ్రహ్మణ్యం. రఘునాథం నిస్తేజంగా నీళ్ళుకారుతూ లేచాడు. భోజనాలు ముగించుకున్నారిద్దరూ.

ఎస్సే వ్రాయడానికి ప్రయత్నిస్తున్నాడు సుబ్రమణ్యం.

కన్నులు పొడుచుకున్నా నిద్రపట్టలేదు రఘునాథానికి. ముందు గతిని తల్చుకుంటూ అదృష్టాన్ని తిలకించుకుంటూ రాత్రి తెల్లవార్లూ అటూఇటూ దొర్లుతూనే ఉన్నాడు.

ఒకవేళ టెలిగ్రాం తండ్రిదగ్గర్నుంచే అయితే ఇంకా సందేహమేమిట్లా విషయంలో! తండ్రికి సుస్తీ తీవ్రమైతే... చచ్చిపోతే...కళ్ళు చీకట్లు కమ్మాయి రఘునాథానికి. తండ్రి చచ్చిపోతే తన్నాక్రమించుకొనే దుస్థితిని తల్చుకోలేకపోయాడు భవిష్యత్తు కారుచీకటిగా ఘోరమైన పీడకలగా తోచిందతనికి.

ఉన్న ముప్పై ఎకరాల మాగాణి భూమినీ ఎందుకూ కొరగాకుండా తగలబెట్టిన తండ్రి దుశ్చర్యని తిట్టుకున్నాడు. అవును మరి ముప్పై ఎకరాల రత్నగర్భలాంటి సెట్టా భూమిని నిరుపయోగంగా సముద్రం పాలు చేసినవాడు తండ్రేమిటి, గర్భ శత్రువుగాని అనుకున్నాడు రఘునాథం.

నిజమే మరి. తాత ముత్తాతలనుంచీ ఎంతో గౌరవ మర్యాదలు గల కుటుంబం అది. పైగా తన తండ్రి ఏవిధమైన సత్కార్యాలూ చేయలేదు. పెళ్ళిళ్లు చేశాడా? కట్నాలిచ్చాడనా లేక దేవాలయాది సప్త సంతానాలకింద ఖర్చు చేశాడనా? వట్టిపుణ్యాన 30 ఎకరాల భూమి గంగపాలవడం యెవరు సహించగలరు?

రఘునాథం గతాన్ని తల్చుకుంటున్నకొద్దీ తీవ్రమైన క్రోధంతో పొంగిపోయాడు. వాళ్ళమ్మ చెప్పిందంతా జ్ఞాపకం వచ్చిందతనికి.

పాపం. ఆ యిల్లాలు గుండెపడు దుఃఖంతో తానునుభవించిన యమయాతనలన్నీ ఏకరువు పెట్టిందావేళ.

"మీ నాన్న మెట్రికులేషన్ పాసవడం, నేను పెద్దదాన్నవడం ఒక్క ఏడాదే జరిగాయి. అయినా మీ తండ్రి ఎంత చెప్పినా వినక కార్యం చేసుకోడానికి కష్టపడలేదు. తీరా కారణం ఏమిటాఅంటే అప్పటికప్పుడే మనూరి రంగసాని పెద్ద కూతురితో యిలాకా పడ్డారని తెలిసింది. దాంతో ఊరుకుంటే పోనీ అనుకోవచ్చు. పట్నంలో కాలేజీ చదువు వెలగబెట్టడానికి వెళ్ళారు మీ నాయన... చదువేంటి నా మొహం!

"ఆయన పెడానికి ఎక్కడ దొరికేవారో నాకాపరానికి చిచ్చుపెట్టే రండముండలు. అక్కడున్న రెండేళ్ళలోనూ

ఎక్కే గుమ్మం. దిగే గుమ్మంట. ఓ పిల్ల జమీందారులా గడిపేవారట. మీ బామ్మగారుండేదే ఆ పిచ్చిముండాకూతురు దిక్కుమాలిన గారాంతో ఆడిందాటగా పాడింది పాటగా చెల్లించేది! ఇంకేం కావాలి చెప్పునాయనా?'' ఆవేళ ఇంక వారం రోజులకి కాలేజీ చదువుకి వెడతాడనగా అన్ని విషయాలు నచ్చచెప్పింది రఘునాథానికి తల్లి. ఆవేళ మేనమామగారింట్లో పుట్టెడు దుఃఖంతో, కొడుకుమీది కోటి ఆశలతో తనకి కించిత్తూ తెలియని తండ్రి జీవిత గాథల్ని ఏకరువు పెట్టింది జానకమ్మగారు.

“నాయనా ఇవన్నీ ఎందుకు చెబుతున్నానో తెలుసా? మీ నాన్న జీవితమే నీకొక గొప్ప గుణపాఠం. మన కుటుంబాన్ని ముందుకీడ్చే భారం నీమీదుంది బాబూ! ఎలా వందనంగా గడుపుకుంటావో ఏమిటో... బాగా చదువుకో నాయనా...బుద్ధిగా ఉండాలి సుమా!'' అంది.

తల్లి కనుకొలకుల్లో నీళ్ళు గిరగిరా తిరిగాయి. చెంగుతో తుడుచుకుంటుంటే చూచిన రఘునాథానికి కూడా దుఃఖమాగింది కాదు. తల్లి బుజ్జగించింది. దీవించి పంపింది. అంత కన్నా ఏం చెబుతుంది— ఆడకూతురు! అర్థం చేసుకోవాలి గాని!...

రఘునాథం అర్థం చేసుకున్నాడు. సత్య ప్రమాణ పూర్తిగా పరస్త్రీని కన్నెత్తి చూడడం అలవాటు లేదతనికి.

తోటి కాలేజి కుర్రాళ్ళు సైముకు ముందొచ్చి మేడమెట్లమీద కూర్చొని అమ్మాయిలు గురించి ఉన్నవీ లేనివీ ఊకదంపుగా మాట్లాడుకుంటుంటే— ప్రహ్లాదుడిలాగ దించిన బుర్ర ఎత్తకుండ తొలగిపోయేవాడు. పుస్తకం తెరచి ఏ పాఠమో చూసుకొనే వాడు. లేదా చెట్టుకింద ఒంటరిగా నుంచునేవాడు. తల్లి చెప్పినవి అక్షరాలా ఆచరించేవాడు రఘునాథం. అంచేతనే ఏమో నలుగురితోనూ కలిసి మాట్లాడటమంటేనే భయంగా ఉండేదాతనికి.

ఏవో పిచ్చి పిచ్చి ఆలోచనలతో రాత్రింతా గడచి పోయింది. బుర్రలో భీతావహం చీకటిలా వ్యాపించింది. వెర్రి ఊహలెన్నో జెర్రిల్లా పాకుతూనే ఉన్నాయి. ఆఖరికి, తెల్లవారుఝామున ఎప్పుడో కోడికూసేవేళ కొద్ది కునుకు పట్టింది. తెల తెలవారుతూండగానే లేచి కూర్చున్నాడు. సుబ్రమణ్యం లేచేలోపలే కాలకృత్యాలు తీర్చుకున్నాడు. స్నానం చేసుకున్నాడు. సంధ్య వార్చుకున్నాడు. సుబ్రమణ్యం లేచి ముఖం కడుక్కోగానే కలిసి కాఫీ కెళ్ళారు. తిరిగి వచ్చే సరికి జవాను సిద్ధంగా ఉన్నాడు. టెలిగ్రాం కాగితం చేతికిచ్చి వెళ్ళిపోయాడు... ఇంకేముంది? అక్షరాలా అనుకున్నంతా అయింది. చూడలేక పోయాడు. తన చుట్టూవున్న లోకం గిరగిరా తిరుగుతున్నట్టయింది. ఎన్నిసార్లు చదివినా అవే అక్షరాలు: "ఫాదర్ సీరియస్ స్టార్ట్ ఇమీడియట్లీ"— లక్ష్మీ నారాయణ.

దుఃఖ మాపుకోలేకపోయాడు రఘునాథం. చిన్న పిల్లాడిలా బావురుమని ఏడ్చాడు.

సుబ్రమణ్యం దగ్గరగా తీసి ఊరడించాడు. విషయాన్ని నచ్చచెప్పాడు. 'ఆపదలందు ధైర్యగుణము—' పూర్తిగా చదివి వినిపించాడు. తాత్పర్యము విడమరచి అన్వయించి విశద పర్చాడు— సుబ్రమణ్యం. అతని కేమంత చెప్పుకోదగ్గ తెలుగు పాండిత్యమూ లేదు. అయినా కొన్ని పుస్తకాల్లోవచ్చే పడి కట్టురాళ్ళవంటి పద్యాలన్నీ కంఠతావచ్చు.

* * *

రఘునాథం ప్రయాణం చేస్తున్నా డన్నమాటే గాని మనసులో మనసులేదు.

తండ్రి చనిపోతే తన బ్రతుకు ఏంగాను? ఎన్నోసార్లు ప్రశ్నించుకున్నాడు. ఆఖరిసారి మాత్రం ఏదో కదలిక కదలిం దతనిలో. తండ్రి చనిపోతే వచ్చే నష్టంఏముంది? ఉండిమాత్రం తనకి, కుటుంబానికి కలిగే మహోపకార మేముంది? ఎటొచ్చి తను ఏదో ఉద్యోగంచేసి, కుటుంబ భారాన్ని నెత్తిమీద పెట్టుకోవలసి వస్తుంది— అంతేగదా? అనుకున్నాడు. ఈ సమాధానం స్ఫురించినప్పటినుంచి గుండెబరువు కొంత తేలికై నట్టుతోచింది. కొంచెం స్థిమితపడ్డాడు రఘునాథం. సాయం త్రం ఆకాశం ఊదారంగుల్ని చిమ్ముతోంది. పశువుల కాళ్ళ

రేపిన ధూళి ఆశగా ఆకాశం కేసి ప్రయాణిస్తోంది. ఆయాసంగా నీరసంగా బెంగగా ఊరుచేరుకున్నాడు రఘునాథం.

వీధి అరుగుమీద తండ్రిని పడేశారు. తల్లి తలాడి దిక్కున కూర్చుని నెత్తీ నోరూ బాదుకుని ఏడుస్తోంది. మేనమామ లక్ష్మీనారాయణగారు కాళ్ళవైపు కొంచెం దూరంలో కూచున్నాడు. పధ్నాలుగేళ్ళ సూర్యకాంతం కూడా ఏమీ భయంలేకుండా, ఆరిందాలాగ అత్తగారిదగ్గర కూర్చుని గుటకలు మింగుతోంది.

రఘునాథం ఇల్లు చేరుకుంటున్నాడు. అల్లంతదూరంలో చూడగానే పెల్లుబికివచ్చే దుఃఖంతో గొల్లుమన్నారింటిల్లిపాదీ- 'నాయినా వచ్చావురో— మీ నాన్నగారు వెళ్ళిపోతున్నార్రో' అని గోలపెట్టి ఏడ్చింది జానకమ్మ.

''ఏమిటండీ, మరీని, చిన్నపిల్లలాగ... ఆ కుర్రాళ్ళ గుండెలుకూడా బేజారవుతాయి సుమండీ...కుర్రాళ్ళకి ధైర్యం చెప్పడంపోయి బాగుంది—' అన్నారు, చూడ్డానికి వచ్చిన సానుభూతిదారుల్లో ఒకరు.

వస్తూనే తండ్రి దగ్గరికి చకచకా వచ్చాడు రఘునాథం. ఎగూపిరితో ఆయాసపడుతున్నాడు తండ్రి. చావుబ్రతుకుల్లో కొట్టుకుంటున్నాడు. తండ్రికి దగ్గరగా జరిగి కూర్చున్నాడు రఘునాథం. తల్లి జానకమ్మ దుఃఖం ఆపుకుంటూంది. సూర్య

కాంతం లేచి నుంచుంది. నుంచుని భర్త కేసి చూస్తోంది. లక్ష్మీనారాయణ జందెంతో వీపు గోక్కుంటున్నాడు. తండ్రి అవస్థచూస్తూ ఆపుకోలేని దుఃఖంతో ఏడుస్తున్నాడు రఘునాథం. భర్తను చూస్తూన్న సూర్యకాంతానికి ఇంకో వెల్లువ పైకుబికింది.

శోకం ఆపుకున్నాడు, కళ్ళు పంచెతో తుడుచుకొని అడిగాడు రఘునాథం—"ఏం నాన్నా ఎలావుందీ?"

కొడుకు కంఠం వినిపించింది. కళ్ళెత్తి చూశాడు తండ్రి. మెల్లగా చేతులతో రఘునాథం చేతుల్ని గుండెలమీదికి తీసుకున్నాడు. చేతులెత్తి సైగచేశాడు. 'నీకోసమే ఉన్నా... వెళ్ళిపోతున్నా' అనే అర్థం స్ఫురించేలా.

తండ్రి అభినయం దుఃఖాన్ని మరీ రెచ్చగొట్టింది. అంతా గొల్లుమన్నారు. బెల్లుబెల్లుగా విరిగి పడిపోతూన్న మట్టి గోడలావుంది ఆ కుటుంబం. ముఖ్యంగా రఘునాథం, తండ్రి గుండెలపై పడి, వెక్కి వెక్కి ఎంతగా ఏడ్చాడని!

ఇంట్లో అందరికీ తెలుసు— ఆ చనిపోతూన్న మానవుడు కుటుంబాని కంతకి తీరని ద్రోహంచేశాడని, ఉన్న ముప్పై యకరాల మాగాణీని అయినకాటికి తెగనమ్మి కొనుక్కున్న రోగాలకే బలైపోతున్నాడని ఇంటిల్లపాదీ ఎరుగుదురు. అయినా ఎవరూ దుఃఖించడం మానలేదు. ప్రాణపోకడ...

పానరాకడగా ఉంది పరిస్థితి. అందరూ దుఃఖభోయిష్టంగా ఘోరంగా విలపిస్తున్నారు.

"ఎంత ఏడ్చి ఏం లాభమమ్మా" అన్నాడు వైద్యుడు వెంకటరమణయ్యగారు. మెడలు వేళ్ళాడేస్తున్న అతని నాడి చూస్తున్నాడు. 'అయిపోయింది' అన్నాడు మళ్ళీ వైద్యుడు.

గొల్లుమన్నారు. అంతా నిర్మొగమాటంగా ఏడుస్తున్నారు. ఏడ్పులతో, పెడబొబ్బలతో. ఇల్లంతా వీథంతా నిండిపోయింది.

రాత్రి...చీకటిలో...వంటరితనంలో...వినిపించే దీనాలాపం...దుఃఖం...త్వరలోనే...నిద్రలో కలిసిపోయింది.

రఘునాథం, మేనమామ లక్ష్మీనారాయణతో ఇంటికి వచ్చేసరికి మధ్యాహ్నం ఒంటిగంటయింది. వచ్చీ రావడంతోనే కొడుకును చూస్తూ గొల్లుమంది జానికమ్మ. "బుగ్గిచేసి వచ్చేశావ్రా నాయినా!" అంటూ ఏడ్చింది.

తండ్రి శవాన్ని దహన సంస్కారం చేసి, తండ్రికి కర్మ చేసే దీక్షతో గుండు చేయించుకున్న రఘునాథం మొహాన్ని ప్రేతకళ ఆవహించింది. భర్త మొహం అలంకార శూన్యంగా వికారంగా, ఉంది. చూడలేక బాధపడింది సూర్యకాంతం. చూస్తూ చిరాకుతో చేదుమాత్ర మింగినట్టుగా, పరధ్యానంగా చెంగు నులిపెడుతూ గుటకలు మింగుతోందామె.

సంతాపంతో జేవురించిన తల్లి మొహాన్నిచూస్తూ నిల బడ్డాడు రఘునాథం. తల్లి ప్రక్కనే నుంచున్న సూర్యకాంతం వేపుకి మళ్ళింది రఘు నాథం దృష్టి. సూర్యకాంతం కన్నుల మీాద కితకితలు పెట్టింది. కన్నులు మూసుకుంది; తల దించు కుంది సూర్యకాంతం. ఆమె ముఖంనుంచి క్రిందికిజారి, నిగ నిగలాడుతూ మెరుస్తున్న శరీరసౌష్టవాన్ని స్పర్శిస్తూ ప్రస రించింది రఘునాథం చూపు!

జాజిమొగ్గలా నవనవలాడుతూ వికసిస్తున్న సూర్య కాంతం యవ్వనం రఘునాథంలో ఆశల్ని రేచ్చగొట్టింది. తండ్రి మరణంతో దిగాలుపడిపోయిన రఘునాథంహృదయంలో సూర్యకాంతం ఆశలు వానజల్లు కురిపించింది—కారుచీకటిలాంటి రఘునాథం భవిష్యత్తులో కోటికాంతుల్ని విరజిమ్మింది సూర్య కాంతం! అయస్కాంతంలా తన్నాకర్షించుకొని, అతిసన్నిహితంగా సూర్యకాంతం లాక్కుంటోందని గ్రహించాడు రఘునాథం.

ఒంటరిగా వీధిలో కూర్చున్నంతసేపూ ఆ విషయమే అతిస్పష్టంగా రుజువు కాజొచ్చింది. "దీన్నే కాబోలు—షేక్ స్పియర్ మహాకవి 'లవ్' అన్నాడు!" అనుకున్నాడు. షేక్ స్పియర్ వ్రాసిన 'ఏజ్ యులైకిట్' నాటకం వాళ్ళ క్లాసుపాఠం గా అవుతోందిమరి!

వీధిలో అరుగుమీాద కూర్చున్నాడు. పడమటి కొండ ల్లోకి చూస్తున్నాడు. ఆలోచిస్తున్నాడు. సుబ్రమణ్యానికి

ఉత్తరం వ్రాస్తున్నాడు. రెండురోజుల్నించి తానను భవించినది ఎంతబాధ! ఉన్న ఒక్క ప్రాణస్నేహితునిదగ్గరా వెలితి చేసుకోకపోతే బ్రతకడం దుర్లభమనిపించింది. అందుచేతనే మూడు పేజీల ఉత్తరం రాశాడు. జాగ్రత్తగా తూచితూచి మరీరాశాడు.

రఘునాథం ఉత్తరం ముగించాడు, మళ్ళీ చదువుకున్నాడు. "జన్మలో యింతమంచి వుత్తరం రాయలేదు!" నిజమే! మరెవ్వరికి రాస్తాడు? ప్రేమలేఖలు వ్రాశాడనా, ఏమన్నానా?—విశేషించి స్నేహితులూ లేరతనికి.

ఉత్తరం చదవడం పూర్తి చేశాడు. సంతకం చేశాడు. కవరుమీద ఎడ్రసురాశాడు. వ్రాస్తూఅనుకున్నాడు, 'ఎంత మంచివాడు సుబ్రమణ్యం!' అని.

సుబ్రమణ్యం గురించి ఆలోచిస్తున్నాడు. అతను ఆవేళ లక్షరూపాయలు—ఖరీదుచేసేమాట అనలేదూ?—ఆ మాట జ్ఞాపకంవచ్చింది. "సుబ్రమణ్యానికి కొడుకు పుడితే...నాకు కూతురుపుడితే...వాళ్ళిద్దరికీ పెళ్ళిచేసెయ్యొచ్చు" ఆనందంగా నిర్ణయించుకున్నాడు.

తనకి పుట్టబోయే కూతురుగురించి ఆలోచనరాగానే, వికసించిన సూర్యకాంతం యవ్వనం గుర్తుకొచ్చింది. "అయితే త్వరలోనే కార్యం చేసుకొంటేనో" అనుకున్నాడు. అనుకున్నాడేగాని కొంచెం సిగ్గుపడ్డాడు. బిగ్గరగా నవ్వుకున్నాడు.

'అర్థం శుభం లేకుండా ఏమిటి పిచ్చిఆలోచనలు?' తన్నుతానే సున్నితంగా ప్రశ్నించుకున్నాడు. గోముగా ఎగ తాళించేసుకున్నాడు.

యథాలాపంగా కొండల్లోకి చూస్తున్నాడు రఘునాథం. సూర్యుడు కొండల్లో చలి మంటలు వేసుకుంటున్నాడు. ప్రొద్దు బాగా క్రుంకిపోయింది. చీకటి జోరీగల సంగీతం పాడుతూ గుమ్మం పొదిగిళ్ళలో పచార్లుచేస్తున్నది. క్రీనీడలు విలాసక్రీడ లారంభించాయి.

సుబ్రమణ్యానికి వుత్తరం ఎల్లుండి అందాలి; ఎంత మంచి వాడు పాపం, ఈకబురు తెలిస్తే ఎంత విచారిస్తాడో!...పోనీ అతని దయఉంటే అంతేచాలు. వూరికే ఆలోచనలు ముసురు తున్నాయి. ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. బరువుగా అడు గులువేస్తూ లోపలికి వచ్చాడు.

అమ్మ యింకా ఏడుస్తూనేఉంది. విధి విరామం లేకుండా ఏడుస్తూనేఉంది. "అబ్బ! అలా ఏడుస్తూందేం చెప్మా" అను కున్నాడు రఘునాథం. తనుమాత్రం ఏడవలేదా ఏంటి? అయినా అమ్మ నాన్న బ్రతుకున్నన్నాళ్ళూ ఏం సుఖమనుభవించిందని? ఏదైనా కష్టం సుఖం మాట్లాడబోతేనే, ఖస్సున కరవొచ్చే వాడే నాన్న...పైగా నిత్య దరిద్రంతో తన్నూ సంసారాన్ని మాడ్చి చంపిన మహానుభావుడు కన్ను మూస్తే అంత ఏడ్చే దేమిటి? అనుకున్నాడు.

అనుకున్నాడేగాని అతని ఆలోచనలు అతనికే విపరీతం గాతోచాయి. ఏదో అంతశ్శక్తి బహిరింద్రియాలను అదుపులో పెట్టి చీవాట్లు పెడుతున్నట్లుగాతోచింది. తనకిమాత్రం తెలియదా! నాన్న తన కేమీ ఉపకారం చేయకపోగా తీరని అపచారం చేసాడని. అయితేమాత్రం తానెంత ఉడుకెత్తిపోయాడు దుఃఖంతో కునారిల్లిపోయాడుకాదా మరి!

నాలుగు మెతుకులు కతికి ఏకాఏకీ తల్లి ఉన్న గదిలోకి వెళ్ళాడు. అమ్మ దగ్గరగాకూర్చున్నాడు రఘునాథం. కొడుకును దగ్గరగా తీసుకొని మొర్రోమంటూ బిగ్గరగా విలపించింది జానకమ్మ. రఘునాథం ఆపుకోలేకపోయాడు. అమ్మ కంఠం కౌగిలించుకున్నాడు. సుదీర్ఘంగా వెక్కి-వెక్కి ఏడ్చాడు. ఇద్దరూ—వయోబేధాలు—మానసిక మర్మాలూ ఎరుగని పసిబిడ్డలవలె బావురుమని ఏడ్చారు. లోకమే ఉసూరుమని ఏడుస్తున్నట్లు తోచింది వారికి. జీవితమే ఒక్క బాష్పబిందువుగా మారిపోయింది.

లక్ష్మీనారాయణ వస్తూనే "ఏమిటరా? మీకేమైనా మతిపోయిందా ఏమిటే?...మరీ కుర్రతనం వస్తోందే నీకు జానకీ' కొంచెం కోప్పడుతూన్నట్లుగా కంఠంమార్చి అన్నాడు.

రఘునాథం బయటికి వచ్చేశాడు. తనకై ఏర్పరచిన పక్క-మీద నడుంవాల్చాడు. కళ్ళనీళ్ళు కరిమ కరిమంగా

ఎండిపో సారంభించాయి. తల్లి గదిలోంచి మాత్రం ఇంకా శోకారవాలు పెల్లుబుకుతూనే వున్నాయి. ఎంత అలసివున్నా శోకంతో గుండె ఎంత సొమ్మసిలివున్నా అతని కంటికి కునుకే దూరమైంది.

ఏమైతేనేం ! నేటినుంచి నాన్న అనే వ్యక్తి తనకింక కనిపించడు. నాన్న తనకీ లోకంలో విడచిపెట్టిన ముసలి బకేడా యిల్లూ—పదహారేళ్ళ పడుచు పెళ్ళామూ, కేవలం శోకమూర్తిగా మారివున్న తల్లీ, తనఖాలో మిగిలివున్న రెండున్నర ఎకరాల మాగాణీ భూమీ— ఈ యావదాస్తీ— తనతో ఏవేవో పూర్వగాథల జ్ఞాపకాలు విన్నవించుకుంటు న్నాయి. ఇల్లు సాక్షాత్తూ తన తాతగారు కట్టిన స్వగృహంలో ప్రత్యంగుళ స్థలమూ తనతో ఏవో విచిత్ర చరిత్రల విషయా లను స్మృతిపథంలో తిరగేస్తోంది. చుట్టుపట్ల భూప్రదేశమంతటా తన పేరు మారుమ్రోగించిన తాతగారు సాక్షాత్కరిస్తు న్నారు. ఆయన సంపాదించిన యావదాస్థికీ ప్రతినిధిగా ఈ ఒక్క యిల్లూ మిగిలివుంది.

విచిత్రం— ఎంత మహానుభావుడి కడుపున ఎలాంటి వాడు పుట్టాడు నాన్న !...నాకు అచ్చంగా తాతగారి పోలికే వచ్చిందనేవారంతా. తాతగారిలాగ నేను మళ్ళీ ఆస్తి అంతా సంపాదించగలనా ? ఏమో దైవకృప అనుకున్నాడు రఘు నాథం.

వెల్లకిలా పడుండి ఆలోచించుకుంటున్న రఘునాథానికి పెణక చిల్లుల్లోంచి ఖగోళం స్థాలీపులాకంగా కనిపించ నారంభించింది. వ్యోమగోళంలోని చంద్రికాంతి ఏటవాలుగా లోపల ప్రవేశిస్తోంది. ఈ యింటిని ఒక్కమార్తైనా మరమ్మత్తే చేయించలేదు నాన్న. నాలుగు పంచపాళీలూ కురుస్తూనే ఉన్నాయి: ఈశాన్యంమూల గదిగోడ బెల్లులూడిపోయి బీటలు వేసింది. నిస్సంకోచంగా స్థావరం ఏర్పరచుకున్న పందికొక్కులు లోలోపల గుల్లచేస్తూ పెల్లగిస్తూనే ఉన్నాయి. ఈయిల్లంతా మరమ్మత్తు చేయించడానికి వెయ్యి రూపాయలౌతుందేమో అనుకున్నాడు రఘునాథం.

తనకీ లోకంలో మిగిలివున్న సొంత యింటిని గురించీ, యింటికి సంబంధించిన పురాతన స్మృతుల గురించీ ఏదో ఆలోచిస్తుంటే, తల్లి గదిలోంచి వచ్చే సన్నని శోకారవం రఘునాథం చెవుల్లోంచి దూసుకుపోయింది. పాపం ఆమెకింకా నిద్ర పట్టనేలేదు !

తల్లి !...తనను కన్న తల్లి !

ముమ్మూర్తుల జానకీదేవి కదూ ! తనకోసమనీ, తన చదువుకోసమనీ ఎంత తాపత్రయపడింది ! ఆఖరికి తను కాలేజీకి వెళ్ళేనాడు నాన్న తనదగ్గర డబ్బులేదంటే— తన శతమానాలు తీసి యిచ్చింది. 'అమ్మ వాడికెక్కువలసిన డబ్బిచ్చి పంపం'డని.

తనంటే పంచప్రాణాలూను. ఎప్పుడైనా శలవలకని యింటికి వస్తే—"మా నాయనే వచ్చావా" అంటూ దగ్గరకు తీసుకొనేది. తలంటిపోస్తూ ఒక లక్ష దీవించేది. అలాంటి తన కన్నతల్లి జీవితమే నరకయాతనగా మారిపోయింది. ఇప్పటికైనా తను ఏదైనా ఉద్యోగం సంపాదించి ఆమెను సుఖపెట్టాలి. ఏలోటూ రానీకుండా ఆమెను సంతోషపెట్టాలి.

ఏవేవో నిశ్చయాలు నిర్మలమైన నీటిలోని పిల్ల కెరటాల వలె నీరసంగా ప్రయాణిస్తున్నాయి. సుందరంగా అల్లాడుతున్నాయి.

తల్లి గదిలోంచి మాత్రం ఏడుపు ఎక్కిళ్ళు వుబికి వస్తూనే వున్నాయి. ఆమె ఆర్తనాదం వినిపిస్తున్నంతసేపూ రఘునాథానికి కునుకే పట్టలేదు. ఎప్పుడో ఉషస్సమీరం తొంగిచూసాక రఘునాథం కనురెప్పలపై నిద్ర కటాక్షించింది.

* * *

నాన్నోయ్!...ఎంత పిల్చినా అత్తయ్య మాట్లాడటం లేదు!" అని కంగారుగా అరుస్తూ సూర్యకాంతం వాకిట్లోకి వచ్చింది. బిగ్గరగా గావుకేక వేసింది. వెంటనే లక్ష్మీనారాయణ "ఏమిటే అమ్మా అది" అంటూ తొందరగా వెడుతున్నాడు. యించుమించు పరిగెడుతున్నాడు.

ఈ హఠాత్సంఘటనతో త్రుళ్ళిపడిలేచాడు రఘునాథం కళ్ళు నులుముకుంటూనే తల్లి గదిలోకి వెళ్ళాడు. విరుచుకపడి వున్న జానికమ్మను లక్ష్మీనారాయణ మావయ్యా అటూ యిటూ కదిపి పలుకరిస్తున్నాడు. రఘునాథం నిశ్చేష్టుడైనించు న్నాడు. అచేతనంగా స్తంభీభూతుడై ఏమాట వింటానో అన్న ఆందోళనతో శూన్యంగా చూస్తూ నుంచున్నాడు. గుడ్లనీళ్ళు క్రుమ్మరిస్తోంది సూర్యకాంతం.

"ఇంకెక్కడత్తయ్యేవ్! వెర్రి తల్లీ" ఒక్కటే కేక పెట్టాడు లక్ష్మీనారాయణ. "అయ్యో జానికమ్మ తల్లీ! ఇలా గొంతు కోసేశావేమేవ్ ? కుర్రాళ్ళకేం చెప్పిపోయావ్" అంటూ బావురుమన్నాడు లక్ష్మీనారాయణ.

"ఆమెకీమధ్య...ఒంట్లో ధాతుబలం తగ్గి...మూర్ఛగా వస్తోందప్పుడప్పుడూ. దుఃఖభారంతో మూర్ఛ వచ్చి...రాత్రి ఎప్పుడో గుండె ఆగిపోయి వుంటుంది.." అన్నాడు నింపాదిగా నీళ్ళు నవుల్తూ వైద్యుడు వెంకటరవణయ్య.

అంతే! మిన్నూ మన్నూ ఏకధారగా— ఏడుస్తూ నేల మీద పడి పొర్లాడుతున్నాడు రఘునాథం. ♦♦

[పరిచురణ — ఆనందవాణి — సంక్రాంతి 1956]